సాక్షి విశాఖపట్నం

శనివారం । 2 । నవంబర్ । 2024

దీపావళా.. కాలుష్య శాపావళా!



ప్రాంతం	దీపావళికి వారం ముందు (మైక్రోగ్రామ్స్ పర్ ఎం3)		దీపావళి రోజు (మైక్రోగ్రామ్స్ పర్ ఎం3)	
	పీఎం-10	పీఎం-2.5	పీఎం-10	పీఎం-2.5
మింది	121.0	45.0	301.0	121.0
ఆటోనగర్	122.0	44.0	241.0	84.0
పోలీస్ బ్యారెక్స్	124.0	66.0	274.0	131.0
ఈఎస్ఐ హాస్పిటల్	121.0	54.0	132.0	107.0
సీతమ్మధార	85.0	36.0	221.0	97.0
జ్ఞానాపురం	134.0	53.0	307.0	108.0
పెదగంట్యాడ	129.0	57.0	193.0	93.0
రాంకీ	115.0	46.0	149.0	76.0
ఎంవీపీ కాలనీ	89.0	32.0	266.0	122.0
జీవీఎంసీ	189.0	89.0	249.0	165.0
నగర సగటు	122.9	52.2	233.3	110.4

అమాంతం పెరిగిన కాలుష్యం

- ప్రమాదకర స్థాయికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- గురువారం రాత్రి 9 గంటలకు 500కి చేరుకున్న ఏక్యూఐ
- సాధారణంగా 110–130 మధ్యలో నగర ఏక్యూఐ
- నాసిరకం టపాసులతో కమ్ముకున్న కాలుష్యం
- కాలుష్యాన్ని పెంచే టపాసులపై ఆంక్షలు విధించని ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : బాణసంచా పేలుళ్లు దద్దరిల్లాయి.. తారాజువ్వల వెలుగుల నడుమ మహానగరం మురిసిపోయింది. చిచ్చుబుడ్లు జిగేల్‌మనిపించాయి. కానీ కాలుష్య మేఘాలు ఊపిరి సలపనివ్వకుండా చేశాయి. కాలుష్యాన్ని పెంచే బాణసంచాపై ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో ప్రమాదకరమైన పొగ విశాఖను కమ్మేసింది. గతేడాది కంటే తక్కువ మోతాదులో బాణసంచా కాల్చినా గాలి నాణ్యత మాత్రం దారుణంగా పడిపోయింది. గతేడాది హరిత దీపావళి చేసుకోగా.. ఈసారి మాత్రం కాలుష్య దీపావళి పడగ విప్పి.. నగర వాసులను అవస్థలకు గురిచేసింది.



ఏటా దీపావళి రోజు గాలి నాణ్యత క్షీణించడం, శబ్ద కాలుష్యం పెరగడం పరిపాటి. ఈసారి మాత్రం దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా కాలుష్యం కమ్మేసింది. నాలుగు గంటల పాటు నగరంపై విషపుగాలి ఆవరించేసింది. గత ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా అందించడంతో బాణసంచా అమ్మకాలు బాగానే జరిగేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అర్హులైన లబ్ధిదారులకు ఒక్క రూపాయి కూడా పథకాల ద్వారా చేరకపోవడంతో జనంలో **కొనుగోలు శక్తి సన్నగిల్లింది. దీంతో బాణసంచా అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. 2023లో సుమారు రూ.30 కోట్ల వరకూ బాణసంచా విక్రయాలు జరగగా.. ఈ ఏడాది మాత్రం రూ.25 కోట్లు** వరకూ విక్రయాలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అమ్మకాలు చూస్తే కాలుష్యం కూడా తగ్గుతుందని అంతా భావించారు. అయితే గతేడాదితో పోలిస్తే కాలుష్యం మాత్రం ప్రమాదకర స్థాయికి చేరుకుందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) వెల్లడించింది.

నాసిరకం టపాసులే కారణం



గతేడాది జరిగిన దీపావళి పండగ నగరాన్ని గ్రీన్ జోన్‌లోనే ఉంచింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు దీపావళి రోజున వెలువడే కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. దీంతో దీపావళి సందర్భంగా గతేడాది విశాఖలో నగరంలో నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) సాధారణం కంటే స్వల్పంగా మాత్రమే నమోదైంది. ఈసారి మాత్రం ఆ అవగాహన కానీ గ్రీన్ క్రాకర్స్ కానీ కనిపించలేదు. తక్కువ కాలుష్యం కలిగించే బాణసంచాలో బేరియం, అల్యూమినియం, పొటాషియం నైట్రేట్ వంటి కాలుష్యం కలిగించే రసాయనాలు అతి తక్కువ మోతాదులో ఉంటాయి. మామూలు టపాసుల కంటే వీటితో దాదాపు 30 శాతం తక్కువ కాలుష్యం కలుగుతుంది. కానీ ఈసారి నాసిరకమైన టపాసులే దర్శనమిచ్చాయి. ప్రభుత్వం టపాసుల విక్రయాలపై ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో.. విచ్చల విడిగా.. కాలుష్యానికి కారణమయ్యే బాణాసంచానే విక్రయించారు. ఈ కారణంగానే.. గాలినాణ్యత ప్రమాదకరస్థాయికి చేరుకుంది.

500కి చేరుకున్న పీఎం 2.5

కేంద్ర కాలుష్య నియంత్ర మండలి ప్రొటోకాల్ ప్రకారం పండుగకు ముందురోజు, పండుగరోజున కాలుష్య తీవ్రతలను నమోదుచేశాయి. సాధారణ రోజులతో పోల్చినప్పుడు మాత్రం గాలినాణ్యతలో భారీగా హెచ్చులు ఉన్నట్లుగా సీపీసీ బీ నివేదిక ప్రకటించింది. పటాసులు కాల్చడంతో గాలిలో దుమ్మూధూళి కణాలు కలిసి గాలినాణ్యతలో ముఖ్యంగా పీఎం స్థాయిలు భారీగా లోపించినట్లుగా తేల్చింది. పర్టిక్యులేట్ మ్యాటర్(పీఎం) 2.5 సాధారణంగా 60 ఉంటుంది. అదేవిధంగా పీఎం-10 100 ఉండాలి. గురువారం రాత్రి 8 గంటల తర్వాత 11 గంటల వరకూ 400కి పైగానే పీఎం 2.5 నమోదు కావడం ఆందోళనలకు గురిచేస్తోంది.

300 దాటి భయపెట్టిన పీఎం-10 నాణ్యత

నగరంలో గాలి నాణ్యత భారీగా పడిపోయిందని ఏపీపీసీబీ ఆందోళన వ్యక్తం చేసింది. పీఎం-10, పీఎం- 2.5 లెవెల్స్ ప్రమాదకరంగా ఉన్నాయని ఏపీ పీసీబీకి చెందిన మొబైల్ పొల్యూషన్ మానటరింగ్ వెహికల్ నమోదు చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీపావళి రోజున సగటు గాలినాణ్యత కంటే రెట్టింపు స్థాయిలో కాలుష్యం కమ్ముకుందనీ ఏపీసీసీబీ విశాఖ అధికారులు తెలిపారు.

శబ్ద కాలుష్యమూ భయపెట్టింది..

కేవలం గాలి నాణ్యతే కాదు.. శబ్ద కాలుష్యం కూడా నగర వాసులన భయపెట్టింది. దీపావళి రోజు సాయంత్రం వరకూ సుమారు 60 నుంచి 65 డెసిబెల్స్ వరకూ కొనసాగింది. సాయంత్రం పండగ మొదలైన తర్వాత.. గరిష్ఠంగా 77.78 డెసిబెల్స్‌కు చేరుకుంది. శబ్దకాలుష్యం 31వ తేదీన ఎలా పెరిగిందో ఓసారి పరిశీలిస్తే...

సాయంత్రం 6.30 గంటలకు	61.26 డెసిబెల్స్
రాత్రి 7 గంటలకు	63.18
రాత్రి 7.30	75.05
రాత్రి 8.16	74.37
రాత్రి 8. 31	77.78
రాత్రి 8.46	77.10
రాత్రి 9	74.47
రాత్రి 9.30	73.65

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం గాలినాణ్యత వివరాలు

రాత్రి 8 గంటలకు	334
రాత్రి 9 గంటలకు	500
రాత్రి 10 గంటలకు	500
రాత్రి 11 గంటలకు	493

సాధారణంగా ఉండాల్సింది : 110–130

నమోదైంది- 5 రెట్లు పైబడి

న్యూస్‌రీల్

నేడు విశాఖకు చంద్రబాబు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం విశాఖ రానున్నారు. ఈమేరకు పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ హరేందిర ప్రసాద్, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితరులు పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు హెలికాప్టర్‌లో విశాఖ చేరుకుంటారు. ఈమేరకు కోస్టల్ బ్యాటరీ వద్ద హెలి ప్యాడ్‌ను అధికారులు పరిశీలించారు. అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దీంతో కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. పార్కును అందంగా తయారు చేశారు.

ఏకాగ్రత పెంపొందించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

కొమ్మాది: విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవాలని డీఈవో ఎస్. ప్రేమ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ దరి వాడపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో తరగతులు నిర్వహణ, మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. కాసేపు పిల్లలతో ముచ్చటించారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించిన ఆయన పిల్లల్లో కొందరు వెనుకబడి ఉండడం గమనించారు. ఉపాధ్యాయులు పిల్లల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భీమిలిలో గల ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలించారు.

గ్రోత్ హబ్‌గా విశాఖ



ఉచిత సిలిండర్ అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గాజువాక : ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో విశాఖ మహానగరాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చి దిద్దుతామని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం-2 పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమం గాజువాకలోని కణితి మార్కెట్ రోడ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుతో కలిసి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరం అభివృద్ధికి నీతి అయోగ్ సహాయంతో ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు రూపొందించామన్నారు. అనంతరం గాజువాక సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్టీల్‌ప్లాంట్ విషయంలోను సానుకూలంగా ఉన్నామని, దానిలో భాగంగానే రెండవ బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఎస్‌వో భాస్కరరావు, పలువురు స్థానిక కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు

విశాఖ సిటీ: గ్లోబ్ హీల్ 2025 అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు సదస్సు ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ నిమాళి తక్షశిల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా భాగస్వామ్యం వహిస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సంతకాలు చేసినట్లు వెల్లడించారు. శ్రీలంకకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏడు దేశాలకు చెందిన 13 విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో బ్యాంకాక్‌లోని అంబాసిడర్ హోటల్లో ఈ అంతర్జాతీయ సదస్సు జరగనున్నట్లు వివరించారు. ఈ సదస్సులో పరిశోధకులు, హెల్త్ కేర్ నిపుణులు తమ పరిశోధన పత్రాలను ఈ నెల 26వ తేదీ లోగా తమకు సమర్పించాలని సూచించారు.

ఓవరాక్షన్ పోలీసులపై సీపీ చర్యలు

- ఆక్సిజన్ టవర్స్ చోరీ కేసులో మహిళపై విచక్షణారహిత దాడి
- ఘనటపై సీపీ సీరియస్.. ఉన్నతాధికారులతో విచారణ
- తాజాగా క్రైమ్ ఎస్ఐ ఎన్.జగదీష్‌పై సస్పెన్షన్ వేటు
- ద్వారకా క్రైమ్ సీఐ బంగారుపాపపై శాఖాపరమైన చర్యలు

సీతమ్మధార: ఓ ఫిర్యాదుపై అనుమానితురాలి పేరిట మహిళ కాలు ఫ్రాక్చర్ అయ్యేలా విచక్షణారహితంగా కొట్టిన ఎంవీపీ క్రైమ్ ఎస్ఐ ఎస్.జగదీష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శాఖాపరమైన చర్యలకు సైతం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు ఈ ఘటనలో ద్వారకా క్రైమ్ సీఐ బంగారు పాపపై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. వివరాలు. ఆక్సిజన్ టవర్స్‌లోని ఓ ఇంట్లో గంగ అనే మహిళ పనిచేసేది. ఆమె పని మానేస్తానని చెప్పి, వెళ్లిపోయింది. అయితే ఇంటి యజమానులు తమ నెక్లెస్‌ను చోరీ చేసిందంటూ గంగపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంవీపీ క్రైమ్ ఎస్ఐ జగదీష్ ఆమెను స్టేషన్‌ను తీసుకువెళ్లి విచక్షణ మరిచి దారుణంగా కొట్టారు. దీంతో ఆమె కాలు విరిగిపోయింది. ఆస్పత్రిలో చేర్పించడంతో గంగ బంధువులు ఆక్సిజన్ టవర్స్ వద్ద మూడు రోజుల క్రితం ఆందోళనకు దిగారు. తప్పుడు కేసు పెట్టిన ఇంటి యజమానులపైనే కాకుండా, విచక్షణారహితంగా కాలు విరగ్గొట్టిన క్రైమ్ ఎస్ఐ జగదీష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మహిళా సంఘాలు కూడా ఆమెకు మద్దతుగా నిలిచాయి. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారుల విచారణలో వాస్తవాలు నిర్ధారణ కావడంతో ఎంవీపీ క్రైమ్ ఎస్ఐను సస్పెండ్ చేస్తూ శుక్రవారం సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో ఆయనతో పాటు ద్వారకా క్రైమ్ సీఐ డి.బంగారుపాపపై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. నగర ప్రజలు ఎటువంటి ఫిర్యాదులైనా 7995095799 నెంబర్‌కు తెలియజేయాలని సీపీ సూచించారు. సమాచారం, ఫిర్యాదులు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

గంటా కొడుకా.. మజాకా!

- కొడుకు, మనవడికీ ప్రొటోకాల్ మర్యాదలు
- గంటా కుటుంబ సేవలో తరిస్తున్న అధికారులు



రవితేజను, అతని కుమారుడిని ఆహ్వానిస్తున్న భీమిలి జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి, అధికారులు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావుకు కల్పించే ప్రొటోకాల్ ఇప్పుడు ఆయన కుమారుడు రవితేజ, మనవడికీ కూడా కల్పించి, తమ స్వామి భక్తిని చాటుకున్నారు ఇక్కడి అధికారులు. బుధవారం రవితేజ పుట్టినరోజు సందర్భంగా భీమిలి జెడ్సీ పి.ప్రేమప్రసన్నవాణి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తిరుపతిరావు, మెప్మా సిబ్బంది తదితరులు గంటా క్యాంప్ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి మరీ.. అభినందించిన సంగతి తెలిసిందే. దీనిపై జోనల్ అధికారులు భీమిలి ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. అసలు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావా? లేక ఆయన కొడుకు రవితేజా? అంటూ ఆక్షేపించారు. శుక్రవారం అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ ఆధ్వర్యంలో ఫ్రీడం క్రికెట్ కప్‌ను గంటా రవితేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవితేజ, ఆయన కుమారుడు పాల్గొన్నారు. వీరికి రాజకీయ నాయకులతో పాటు జెడ్సీ ప్రేమప్రసన్నవాణి ఎదురెళ్లి మరీ ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే కుమారుడు, మనవడి వెంట ప్రొటోకాల్ అధికారులు పాల్గొనడంతో స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. గతంలో భీమిలి, పెదగంట్యాడ మండలాల జెడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయుడిగా పనిచేసి, ఆ తర్వాత అమరావతి ఎస్‌సీఈఆర్టీలో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ ప్రస్తుతం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పీఏగా ఉన్నారు. ఎమ్మెల్యే లేకుండానే ఆయన కుమారుడు, మనవడి కార్యక్రమాలతో పాటు రెండు రోజుల క్రితం జరిగిన రవితేజ పుట్టినరోజు వేడుకలను ఈయనే అంతా తానై నడిపించారు. ఈ తీరును కూటమి నాయకులు సహించలేకపోతున్నారు. వీరి పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్టుగా ఉంది. ఎమ్మెల్యే గంటాకే కాకుండా ఆయన కుటుంబం మొత్తానికి సేవ చేసుకోవాలా.. అంటూ గొణుక్కుంటున్నారు.

అవ్వా,తాతలకు చుక్కలు

- సర్వర్ సమస్యతో పింఛన్ల పంపిణీ ఆలస్యం
- సచివాలయాల వద్ద క్యూ
- ఎండలో ఇబ్బంది పడ్డ వృద్ధులు, వితంతువులు



ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో సచివాలయ ఉద్యోగుల కోసం వేచి ఉన్న వృద్ధులు



19వ వార్డులో సర్వర్లు పనిచేయకపోవడంతో సచివాలయంలో వృద్ధుల ఎదురు చూపులు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీ వచ్చిందంటే అవ్వా తాతల మోముల్లో ఆనందం వెల్లివిరిసేది. ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి పింఛన్లు అందజేసేవారు. కూటమి ప్రభుత్వ వచ్చాక..ఆ చిరునవ్వులు బోసిపోయాయి. వృద్ధులు, వితంతువులు పెన్షన్ల కోసం ఎదురు చూసే పరిస్థితి వచ్చింది. తాజాగా శుక్రవారం పంపిణీ చేసిన పింఛన్ల ప్రక్రియలో అవ్వాతాతలకు చుక్కలు కనిపించాయి. ఇంటికే వచ్చి పింఛన్లు అందజేస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. అందరూ సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. ఉదయం 9 గంటలైనా కొన్ని ప్రాంతాల్లో పింఛను సొమ్ము చేతికి అందలేదు. సర్వర్ పనిచేయడం లేదని గంటల తరబడి క్యూలో నిల్చోబెట్టారు. దీంతో వృద్ధులు ఆపసోపాలు పడ్డారు. జిల్లాలో మొత్తం 1,61,969 పింఛన్లు ఉండగా, వీరి కోసం రూ.69,59,56,000 ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి 93.98 శాతం మందికి పింఛను పంపిణీ పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ పింఛన్లు పంపిణీ చేసింది.

‘కూటమి’ వచ్చాకే ఉక్కుకు మరిన్ని కష్టాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ




మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సీతంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వామపక్ష పార్టీలు, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారని, అధికారంలోకి వచ్చాక కేంద్రం చెప్పినట్టు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. అనేక రకాలుగా స్టీల్‌ప్లాంట్ కుంటుపడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాటం కార్మికులకు మాత్రమే పరిమితం కాకూడదని, దీనిని ప్రజా పోరాటంగా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఢిల్లీలో కూడా పోరాట కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంపై ఈ నెల 7వ తేదీన విజయవాడలో వామపక్ష పార్టీల సమావేశం జరుగుతుందని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకువెళడంపై చర్చిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు పలుసార్లు ప్రధాని మోడీని కలిసినా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడలేదని విమర్శించారు.సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌లు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏవీ రవివర్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు వై. కొండయ్య, ఆడారి అప్పారావు, ఎం.రామచంద్రరాజు, కె.దేవా, కె.శంకరరావు పాల్గొన్నారు.

స్నేహితులే దొంగలు

- 4 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాల చోరీ


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

విశాఖ విద్య: స్నేహితులను ఇంటికి తీసుకెళ్తే.. వారు బంగారు ఆభరణాలతో ఉడాయించిన ఘటన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలివీ.. సింహాచలం కాపుదిబ్బ ప్రాంతానికి చెందిన ఎస్.సత్యవతి తమ ఇంట్లోని బంగారు ఆభరణాలు కనిపించలేదని గత నెల 28న గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జి.తేజేశ్వరరావు చుట్టుపక్కల వారితోపాటు సత్యవతి కుటుంబ సభ్యుల నుంచి పూర్తిస్థాయిలో వివరాలను రాబట్టారు. బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయిన ముందురోజు సత్యవతి కుమారుడి స్నేహితులిద్దరు ఆమె ఇంటికి వచ్చారు. కుమారుడి స్నేహితులు కావడంతో వారిని ఇంట్లో స్వేచ్ఛగా తిరగనిచ్చారు. అయితే ఆ ప్రబుద్ధులకు ఆమె ఇంట్లో బంగారు ఆభరణాలపై కన్నుపడింది. బీరువాలోని చైను, చెవుదిద్దులు, కాళ్ల పట్టీలు తదితర 25 తులాల వెండి ఆభరణాలు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. పోలీసుల దర్యాప్తులో ఈ విషయం వెలుగులోకి రావడంతో వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేసి, బాధితులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులిద్దరూ మైనర్లు కావడంతో వారిని జువైనల్ కోర్టులో హాజరు పరిచారు. సకాలంలో స్పందించి చోరీ కేసును ఛేదించిన క్రైం సీఐ, ఎస్ఐలను డీసీపీ(క్రైం) లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు అభినందించారు.

కార్తీకం.. ఆధ్యాత్మిక సంరంభం

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- డిప్యుటేషన్‌పై 100 మంది నియామకం


విద్యుత్ వెలుగుల్లో సీతంపేట పార్వతీశ్వరాలయం

మహారాణిపేట: కార్తీక మాసం కోసం శివాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం నుంచి నెల రోజుల పాటు కార్తీకమాసం పూజల కోసం దేవదాయశాఖ ఉప కమిషనర్(డీసీ) సుజాత పర్యవేక్షణలో జిల్లా సహాయ కమిషనర్(ఏసీ) టి.అన్నపూర్ణ ఏర్పాట్లు చేశారు. పందిర్లు, క్యూలైన్లు, తాగునీరు, శానిటేషన్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. భక్తులు దీపాలు పెట్టే ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏసీ అన్నపూర్ణ సంబంధిత సిబ్బందిని సూచించారు. ఈ నెలంతా విధులు నిర్వహించేందుకు సుమారు 100 మందిని డిప్యుటేషన్‌పై నియమించామన్నారు.

శివాలయాల్లో భారీ ఏర్పాట్లు : ఉమ్మడి విశాఖలో 28 శివాలయాలున్నాయి. వాటిలో భక్తుల తాకిడి భారీగా ఉండే ఆలయాలు 15 వరకు ఉన్నాయి. ఈ ఆలయాల్లో క్యూలైన్ల, భక్తుల గోత్ర నామాలు, అభిషేకాల కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు : శుక్రవారం సాయంత్రం ఆలయాల్లో ఆకాశ దీపాలు మొదలయ్యాయి. శనివారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు రోజూ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 4 సోమవారాలు, ఏకాదశి, పౌర్ణమి, నాగుల చవితి, క్షీరాబ్ది ద్వాదశి రోజుల్లో విశేష పూజలు, అభిషేకాలకు ఆయా దేవాలయాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 2న పోలి స్వర్గంతో కార్తీక మాస ఉత్సవాలు ముగియనున్నాయి.

ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు ఎంపీ నిధులు

- రూ.50 లక్షలు ప్రకటించిన గొల్ల బాబూరావు


నిర్మాణంలో ఉన్న ఆస్పత్రిని సందర్శించిన ఎంపీ బాబూరావు, కమిటీ సభ్యులు

మహారాణిపేట: ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలను రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ప్రకటించారు. గంభీరంలోని ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం పాలియేటీవ్ కేర్ ఆస్పత్రి నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు నిర్మాణంలో ఉన్న ఆస్పత్రికి సందర్శించారు. స్నేహ సంధ్య, ఏజ్ కేర్ ఫౌండేషన్ కోర్ కమిటీ సభ్యులు జి.సాంబశివరావు, ఎస్.రాజు, ఒ.నరేష్ కుమార్, కె.కుమార్‌రాజా, డి.ఎస్.వర్మ తదితరులు ఆస్పత్రి నిర్మాణం, అందులో సౌకర్యాలు, అందించే వైద్య సేవలు గురించి ఎంపీకి వివరించారు. వృద్ధుల సంక్షేమం, ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు తన పూర్తి మద్దతు, సహకారం ఉంటుందని ఎంపీ బాబూరావు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలో వైద్య పరికరాల కోసం ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఎంపీకి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో అగ్ని ప్రమాదం

- రూ.35 లక్షల వరకు ఆస్తి నష్టం
- కంప్యూటర్లు, ఫర్నిచర్ దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దాబాగార్డెన్స్: జైలురోడ్డులోని రెడ్నం గార్డెన్స్ వద్ద గల భారతీయ స్టేట్ బ్యాంక్ విశాఖ మెయిన్ బ్రాంచ్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేనప్పటికీ ఆస్తి నష్టం వాటిల్లింది. దీపావళి పండగ కావడంతో బ్యాంక్ గురువారం మూసివేశారు. ఉదయం బ్యాంక్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి పెద్ద ఎత్తున పొగలు రావడంతో వాచ్‌మన్, స్థానికులు, బ్యాంక్‌పై అంతస్తులో నివాసం ఉంటున్న వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం పొగలు విస్తరించడంతో బ్యాంక్ షట్టర్లు విరగ్గొట్టి ఆరు అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పలు కంప్యూటర్లు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.35 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని వెల్లడించారు.

గురుకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్యదర్శి పోలా భాస్కర్


ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహిస్తున్న పోలా భాస్కర్

సింహాచలం: రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా జ్యోతీబా పూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సమస్యలపై జోన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సెక్రటరీ పోలా భాస్కర్ తెలిపారు. సింహాచలంలోని బాలుర గురకుల పాఠశాలలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో తొలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 107 బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 40 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు తెలిపారు. 15 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మొత్తం 107 గురుకుల పాఠశాలల్లో కేవలం 28 స్కూళ్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని, వాటిల్లో కూడా కొన్ని సమస్యలు ఉన్నట్లు తెలిపారు. సొంత భవనాల్లేని 79 పాఠశాలల్లో 28 స్కూళ్లకు స్థలం ఉన్నా, భవనాల్లేవని, సరిపడా స్థలం కూడా లేని స్కూళ్లు 51 ఉన్నాయన్నారు. స్థలం ఉన్న, లేని స్కూళ్లకు వేర్వేరుగా భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. 79 స్కూళ్లకి సంబంధించి డీపీఆర్ తయారుచేసి, నిధుల కోసం చర్చిస్తున్నట్లు వెల్లడించారు. టెన్త్ విద్యార్థులకు అందుతున్న బోధనపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్తామన్నారు. సబ్జెక్టుల వారీగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో 26 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ మోహన్, సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమామోహిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఆంధ్రమాతకు హారతి'


తెలుగుతల్లికి జేజేలు పలుకుతున్న విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కూడలిలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద 'ఆంధ్రమాతకు హారతి' పేరిట శుక్రవారం వేడుకలు జరిగాయి. తెలుగుదండు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, భాషాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొని తెలుగుతల్లికి నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి పొట్టి శ్రీరాములు ప్రత్యేక రాష్ట్రం సాధించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కుంటిసాకులతో తెలుగు జాతి భాషా, సంస్కృతులకు సంబంధించిన వేడుకలపై శీతకన్ను వేసిందన్నారు. శివాజీపాలెం పురపాలక శాఖ పాఠశాల విద్యార్థులు, ఉమాగాంధీ, శేఖరమంత్రి ప్రభాకర్, వేదుల కామేశ్వర శర్మ, చిన సూర్యనారాయణ, కొచ్చెర్లకోట సత్యనారాయణ మూర్తి, ఆచార్య ప్రసాద్, పైలా గీతిక, శ్రీధర్, నాంచారయ్య పాల్గొన్నారు.

ఒకే రోజు నాలుగిళ్లలో చోరీ

- 37 తులాల బంగారు ఆభరణాల అపహరణ

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో గత నెల 31న వరుసగా నాలుగిళ్లలో చోరీలు జరిగాయి. సుమారు 37 తులాల బంగారు ఆభరణాలను దొంగలించుకుపోయినట్లు బాధితులు పరవాడ పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ దరి మురళీనగర్‌కు చెందిన కె. సాయిపవన్, తమిళనాడుకు చెందిన ప్రదీప్ సింహాద్రి ఎన్టీపీసీలో సీనియర్ మేనేజర్లుగా పనిచేస్తున్నారు. మరో ఇద్దరు ఉద్యోగులు కూడా దీపాంజలినగర్‌లో కుటుంబ సభ్యులతో సీ–15, సీ–20, సీ–35, సీ–81 క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. సాయిపవన్, ప్రదీప్ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలను జరుపుకోవడానికి బుధవారం వారి సొంత గ్రామాలకు వెళ్లారు. వేడుకలు ముగించుకుని శుక్రవారం సాయంత్రం వీరిద్దరూ తిరిగి ఇంటికి చేరుకున్నారు. వారిద్దరి ఇళ్ల తలుపులు విరగ్గొట్టి ఉండడంతో కంగారుపడ్డారు. సాయిపవన్ ఇంట్లో బీరువాలో ఉంచిన 29 తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి సామగ్రి దొంగలించుకుపోయారు. అలాగే ప్రదీప్ ఇంట్లో బీరువాలో ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలను దొంగలించుకుపోయినట్లు గుర్తించారు. పరవాడ పోలీసులకు వీరిద్దరూ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. మరో ఇద్దరి నుంచి ఇంకా ఫిర్యాదు అందలేని పోలీసులు తెలిపారు. ప్రజలంతా దీపావళి వేడుకల్లో ఉండగా.. టపాసులు శబ్దంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఈ చోరీలకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లను పరవాడ సీఐ మల్లికార్జునరావు పరిశీలించి బాధితులను నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీంను రంగంలోకి దింపి వేలిముద్రలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

వివాదంలో స్టెల్లా మేరీ స్కూల్

- నోటీసులు జారీ చేసిన ఎంఈవో

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లే అవుట్‌లో నిర్వహిస్తున్న స్టెల్లా మేరీ స్కూల్ వివాదంలో చిక్కుకుంది. గత నెల 30న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించింది. దీపావళి పండగ రోజున బాణసంచాతో కలిగే ఇబ్బందులను వివరిస్తూ ప్రదర్శన చేపట్టినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. అయితే దీనిపై కొంతమంది వ్యతిరేకత వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఈ గొడవలో తమను కించపరిచే విధంగా మాట్లాడారని పాఠశాల యాజమాన్యంతో పాటు క్రిస్టియన్ సంఘాలకు చెందిన వారు శుక్రవారం ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో పాఠశాల యాజమాన్యంపై హిందూ మత సంఘాల ప్రతినిధులు కూడా ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదులను స్వీకరించిన ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ముందస్తు అనుమతుల్లేకుండా విద్యార్థులతో రోడ్లపై ప్రదర్శన నిర్వహించడంపై స్కూల్ నిర్వాహకులకు నోటీసు జారీ చేసినట్లు గోపాలపట్నం ఎంఈవో అంబటి సోమేశ్వరరావు తెలిపారు. వారి నుంచి వచ్చే వివరణ మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విశాఖ- విజయవాడ మధ్య జనసాధారణ్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం–విజయవాడ–విశాఖపట్నం మధ్య జనసాధారణ్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–విజయవాడ(08567) జనసాధారణ్ స్పెషల్ విశాఖలో ఈ నెల 1, 3, 4, 6, 8, 10, 11, 13వ తేదీల్లో ఉదయం 10గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 4 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విజయవాడ–విశాఖపట్నం(08568) జనసాధారణ్ స్పెషల్ విజయవాడలో ఆయా రోజుల్లో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మధ్యరాత్రి 12.35 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు. విశాఖపట్నం–చెన్నై ఎగ్మోర్ (08557) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2, 9, 16, 23, 30వ తేదీల్లో, చెన్నై ఎగ్మోర్ –విశాఖపట్నం(08558) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 3, 10, 17, 24, డిసెంబర్ 1వ తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు. విశాఖపట్నం–కొల్లాం (08539) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6, 13, 20, 27వ తేదీల్లో, కొల్లాం –విశాఖపట్నం(08540) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 7, 14, 21, 28వ తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీఎం కోరారు.

దీపావళి వేడుకల్లో అపశ్రుతులు

- 12 మందికి గాయాలు.. కేజీహెచ్‌లో 10 మందికి చికిత్స



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నా, భాస్కర్

మహారాణిపేట: దీపావళి వేడుకల్లో పలుచోట్ల అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. గురువారం బాణసంచా కాల్చుతూ గాయపడిన 12 మంది కేజీహెచ్‌లో చేరారు. వీరికి బర్న్స్ వార్డులో చికిత్స అందిస్తున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్ తెలిపారు. స్వల్పంగా గాయాలైన ఇద్దరిని డిశ్చార్జ్ చేసి, 10 మందికి చికిత్స అందిస్తున్నట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ టి.మోహనరావు వెల్లడించారు. ప్రస్తుతం ఎం.చిన్నా, ఎం.భాస్కర్, కె.దివ్య, ఎ.కిశోర్, వి.నవీన్, పి.పార్వతి, వై.నాగార్జున, కార్తికేయ, కె.శ్రీనివాసరావు, అప్పారావులకు వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. వీరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో యువకుడి దుర్మరణం

- స్నేహితుడి జన్మదిన వేడుకల్లో విషాదం
- మద్యం సేవించి ఈత కొట్టిన వంశీ


స్నేహితుడికి కేక్ తినిపిస్తున్న వంశీ

పద్మనాభం: రేవిడిలోని ఆర్.కె.లేఅవుట్ వద్ద ఉన్న కురసా రిసార్ట్ స్విమ్మింగ్ పూల్‌లో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. భీమునిపట్నం మండలం కృష్ణరాజుపేటకు చెందిన టీడీపీ నాయకుడు గుడ్డాల ఎల్లయ్య కుమారుడు రవితేజతో పాటు వి.కుమార్, డి.స్వామి రేవిడిలో రిసార్ట్ నడుపుతున్నారు. ఎంవీపీకాలనీకి చెందిన బండ్రెడ్డి అభిషేక్ వంశీ(23)తో సహా ఏడుగురు గత నెల 30న రాత్రి రిసార్ట్‌కు వచ్చారు. ఏడుగురిలో ఒకరి పుట్టినరోజు కావడంతో.. కేక్ కటింగ్ అనంతరం పూటుగా మద్యం సేవించారు. తర్వాత రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు దిగారు. వీరిలో ఆరుగురు స్నానం చేసి రూమ్‌కు వెళ్లిపోయారు. అభిషేక్ వంశీ ఎంతకీ రాకపోవడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో స్విమ్మింగ్ పూల్ వద్ద వెతికారు. వంశీ నీటిపై తేలుతూ కనిపించడంతో వెంటనే సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వంశీ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడు తండ్రి రాంబాబు విశాఖ డెయిరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. అతనికి తల్లి, సోదరుడు ఉన్నారు.

మంటలు అంటుకుని వృద్ధురాలి మృతి


సూర్యకుమారి(ఫైల్)

సీతమ్మధార: దీపావళి రోజున కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చేరి, చికిత్స పొందుతున్న వృద్ధురాలు మరణించింది. 4వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు. తాటిచెట్లపాలెంలో దార్లపూడి సూర్యకుమారి(93), మనవడు బద్రీనాథ్‌తో కలిసి ఉంటోంది. గురువారం రాత్రి 7 గంటల సమయంలో దీపారాధనలో భాగంగా గుమ్మం దగ్గర వెలిగించిన దీపాలు గుమ్మానికున్న కర్టెన్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. వాటిని ఆపే ప్రయత్నంలో ఆమె చీరకు మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడటంతో వెంటనే అంబులెన్స్‌లో దొండపర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి కలెక్టరేట్ వద్దనున్న మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చికిత్సకు నిరాకరించడంతో కేజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించినట్లు వైద్యులు తెలిపారు. మనవడు బద్రీనాథ్ తన అమ్మమ్మ చివరి కోరిక మేరకు శ్రీకాకుళం జిల్లాలోని స్వగ్రామమైన నరసన్నపేట దరి పోలాకి గ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఎస్ఐ జి.వెంకట్రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డాడ్జ్‌బాల్ పోటీలకు హేమప్రకాష్ పయనం



సబ్బవరం: మలేసియాలో శనివారం నుంచి జరిగే అంతర్జాతీయ డాడ్జ్‌బాల్ పోటీలకు మండలంలోని తవ్వవానిపాలెనికి చెందిన యువకుడు పయనమయ్యాడు. ఈ గ్రామానికి చెందిన పైల హేమ ప్రకాష్ ఆగస్టు 25న తెనాలిలోని చిలుమూరులో జరిగిన అండర్–21 విభాగం డాడ్జ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. అక్టోబర్‌లో 27 నుంచి 31వ తేదీ వరకు చండీఘడ్‌లో డాడ్జ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన శిక్షణలో పాల్గొన్నాడు. శనివారం నుంచి 5వ తేదీ వరకు మలేసియాలో జరిగే అంతర్జాతీయ డాడ్జ్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఆయన బయలుదేరి వెళ్లాడు.

అధికంగా మద్యం సేవించిన వ్యక్తి మృతి

పీఎంపాలెం: అధికంగా మద్యం సేవించిన వ్యక్తి మరణించిన ఘటన పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. వుడాకాలనీ శివాలయం వెనక వైపు యాలకల జోగినాయుడు (45) భార్య లక్ష్మి, కుమారులు జగదీష్, నరేష్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తలు సిమెంట్ పనికి వెళ్తుంటారు. మద్యానికి బానిసైన జోగినాయుడు దసరా నుంచి పనికి వెళ్లడం లేదు. గత నెల 30న అధికంగా మద్యం సేవించిన జోగినాయుడు కారుషెడ్ కూడలికి సమీపంలో పడిపోవడంతో.. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. 31న కూడా అధికంగా మద్యం సేవించి మధురవాడ ఆర్టీసీ డిపో సమీపంలో రోడ్డుపై పడిపోయాడు. ఈ సమాచారం అందుకున్న అతని కుటుంబ సభ్యులు వెంటనే జోగినాయుడిని కేజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతనికి ఫిట్స్ ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.